క్లుప్తంగా

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం..

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: మండలంలోని వీకే రాయపురంలో కాజ్‌వే కోతకు గురైన సమయాల్లో రైతులు, ఆ గ్రామ ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని డ్రైనేజీ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.హేమలత శనివారం తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం అతలా'కోత'లం అనే శీర్షికన వచ్చిన కథనానికి డ్రైనేజీ శాఖ అధికారులు స్పందించారు. ప్రతి ఏడాది భారీ వర్షాలకు, ఏలేరు కాలువలో వరద ఉధృతి వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కాజ్‌వే పాడైపోవడం జరుగుతుంది. ఈ మేరకు ప్రతి ఏడాది తాత్కాలిక మరమ్మతులు చేస్తూ వీకే రాయపురం గ్రామ రైతులు పొలాలకు వెళ్లడానికి, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామని హేమలత అన్నారు. రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం వెస్ట్ ఏలేరు డ్రైను ఆధునీకరణలో భాగంగా వీకే రాయపురం ఏలేరు కాలువపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పరిపాలన అనుమతులకు పంపామన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కమిషనర్ కోరారు.

బాధితులకు సాయం



బాధితులకు సాయం అందించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక బలుసులపేటలో ఇటీవల కురిసిన వర్షానికి పెంకిటిళ్లు కూలిపోయి మూడు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. శనివారం సాయంత్రం నీలమ్మ చెరువు వద్ద ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో బాధితులకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ కోశాధికారి ఏలేటి రమేష్, క్లబ్ ప్రతినిధి వేగు సత్యనారాయణ, క్లబ్ మాజీ అధ్యక్షుడు మాజేటి కృష్ణ, కౌన్సిలర్ నేతల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



సామర్లకోట సొసైటీ వద్ద యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

సామర్లకోట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి యూరియా రావడంతో రైతులు బారులు తీరారు. ఇప్పటికే వరి పంట పొలాలు పాలు పోసుకునే స్థితిలో ఉన్నాయి. ఈ సమయంలో యూరియా అంతగా అవసరం లేదని రైతులు అంటున్నారు. అయితే ఆలస్యంగా వరి నాట్లు వేసిన రైతులు యూరియా కోసం బారులు తీరారు. శనివారం 20 టన్నుల యూరియా వచ్చిందని, రైతుల వేలిముద్రలు సేకరించి రెండు బస్తాల చొప్పున యూరియా అందజేస్తున్నామని సొసైటీ అధ్యక్షుడు ఫైణ్ని శ్రీనివాస్ తెలిపారు. ఇక నుంచి రైతులకు యూరియా అవసరం ఉండదన్నారు. ఏలేరు కాలువ నుంచి నీరు ఆలస్యంగా రావడంతో ఆ ప్రాంత రైతులు మాత్రమే యూరియా తీసుకొన్నారని చెప్పారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



ఇన్‌చార్జి ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న రాయుడు మోజెస్‌బాబు

సామర్లకోట: మండలంలోని పనసపాడు గ్రామంలో రోజు రోజుకూ పెరిగిపోతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని బీసీ ఐక్యవేదిక జిల్లా నాయకుడు రాయుడు మోజెస్‌బాబు అన్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.భైరవమూర్తికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో పిఠాపురం మహారాజా ఇచ్చిన స్థలంలో బండిబాట 80 అడుగుల రోడ్డు ఆక్రమణకు గురైందన్నారు. అదే విధంగా గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి శ్మశాన వాటికలు లేకపోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నామని, ఈ సమస్యలపై గత ఏడాది కాలంగా పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆయన ఆరోపించారు.

ఇలా సాగుపోదామా..

- పీఎండీఎస్ విధానంతో బహుళ ప్రయోజనాలు
- పొదుపు సంఘాల ద్వారా కిట్ల విక్రయం
- నేలను సారవంతం చేసేందుకు ఉపయుక్తం



రైతులకు అందించేందుకు సిద్ధం చేసిన విత్తనాల కిట్లు



పీఎండీఎస్ విత్తనాలు

పెద్దాపురం: రసాయనిక ఎరువుల వినియోగంతో భూమిలో సారం కోల్పోతుంది.. తద్వారా పంటల సాగుకు ఇబ్బంది ఎదురవుతోంది.. దీనిని అధిగమించేందుకు ప్రకృతి సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది.. గత ప్రభుత్వం ఈ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించింది. ఫలితంగా పెద్దాపురం నియోజకవర్గంలో సుమారు 300 మంది రైతులు ముందుకు వచ్చారు. జి.రాగంపేట, గోరింట, అచ్చంపేట, ఉండూరు, పనసపాడు గ్రామాల్లో ఎక్కువగా ప్రకృతి సాగు చేస్తున్నారు. మరో 570 మంది రైతులు రెండు రకాలుగా పంటలు వేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పెసర మాత్రమే వేసి నేలను సారవంతం చేస్తూ వచ్చారు. ఇప్పుడు ప్రకృతి సాగు చేస్తున్న రైతులకు పీఎండీఎస్ (ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్) కిట్లను అందజేసేలా ప్రకృతి వ్యవసాయ విభాగం కృషి చేస్తోంది. ఎకరం వరి చేలో 32 రకాల విత్తనాల 14 కిలోల పీఎండీఎస్ కిట్లను అందిస్తోంది. ఈ కిట్ల తయారీ, విక్రయం రెండూ పొదుపు సంఘాల ద్వారా చేయిస్తోంది. ఒక్కో కిట్ రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తోంది.

30 రకాలు.. ప్రయోజనాలు

ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ కిట్లలో మినుములు, పెసర, బొబ్బర్లు, చిక్కుడు, నువ్వులు, ఆముదం, వేరుశెనగ, ధనియాలు, మెంతులు, ఆవాలు, రాగులు, మొక్కజొన్న, కొర్రలు, సామలు, జీలుగ, కట్టిజనుము, పిల్లి పెసర, ఆకుకూరలు, దుంపజాతి, తీగజాతి వంటి విత్తనాలను శుద్ధి చేసి, పిల్లిపెసర రెండు కిలోలు, జీలుగ రెండు కిలోలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన 30 రకాల విత్తనాలను ఇస్తున్నారు. ఈ విత్తనాలను పంట పొలాల్లో చల్లిన తరువాత మొలకలు రాగానే వాటిని నేలలో దుక్కి దున్నడం ద్వారా నేల సారవంతమవుతుంది. వీటి వేర్ల వల్ల నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయి. నీటి సామర్థ్యం పెరుగుతుంది. నేల కోతకు గురికాకుండా ఉంటుంది. సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. కలుపు మొక్కల బెడద ఉండదు. స్థూల సూక్ష్మ పోషకాలు ప్రధానంగా పంటకు అందుతాయి.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



ప్రకృతి వ్యవసాయం చేయడమే కాకుండా ప్రస్తుతం నేను ఫార్మర్ మాస్టర్ ట్రెనీగా విధులు నిర్వర్తిస్తున్నా. పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహిస్తున్నాను. ఈ విధానం వల్ల ప్రారంభంలో దిగుబడి తక్కువగానే ఉంటుంది. రాను రాను బాగా పెరుగుతుంది.

– ఎ.ఎలియాజర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, కాకినాడ

పొదుపు సంఘాల ద్వారా..



పెద్దాపురం నియోజకవర్గంలో జి.రాగంపేట, గోరింట, అచ్చంపేట, ఉండూరు, పనసపాడు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. పీఎండీఎస్ కిట్లను తయారు చేయడానికి పొదుపు సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. రైతు సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా పీఎండీఎస్ కిట్లను అందజేస్తున్నాం.

– జి.శివచక్రం, ఎన్‌పీఎం మాస్టర్ ట్రైనీ, పెద్దాపురం

పాదగయను దర్శించిన ఐజీ అశోక్‌కుమార్



పాదగయ క్షేత్రం వద్ద ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ దేవరాజు పాటిల్‌లతో కలసి శనివారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. పురుహూతికా అమ్మవారిని, కుక్కుటేశ్వర స్వామివారిని, శ్రీపాద వల్లభస్వామిని, దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు అభినందన

సామర్లకోట: నియోజకవర్గంలో ఈ డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం అభినందించారు. ఎంపికైన 64 మంది మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో కలిశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు తదితరులు ఉన్నారు.

రోడ్డు మార్జిన్‌లో చెత్త లేకుండా చూడండి



సామర్లకోట - కాకినాడ రోడ్డు మార్జిన్‌లో చెత్తను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్, డీపీఓ తదితరులు

సామర్లకోట: రోడ్డు మార్జిన్‌లో చెత్త లేకుండా చూడాలని, అవసరమైన ప్రదేశాల్లో డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని ట్రైనీ కలెక్టర్ మనీషా ఆదేశించారు. శనివారం కాకినాడ ఇంద్రపాలెం నుంచి సామర్లకోట వరకు రోడ్డు మార్జిన్‌లో ఉన్న చెత్తను ఆమె పరిశీలించారు. ఇటీవల రోడ్డు మార్జిన్లలో చెత్త పేరుకుపోవడం, గతంలో తొలగించిన షాపులు, ఇళ్ల ప్రదేశాల్లో యథాప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయని కలెక్టర్‌కు కొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె కాకినాడ – సామర్లకోట రోడ్డును పరిశీలించారు. రోడ్డు మార్జిన్‌లో చెత్త వేసేవారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కాకినాడ రోడ్డు పొడవునా ఉన్న చెత్తను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కొబ్బరి బొండాలు, ఇళ్ల కూల్చివేత వ్యర్థాలు రోడ్డు మార్జిన్‌లో వేసిన ప్రాంతాలను ఆమె గమనించారు. కార్యక్రమంలో డీపీఓ రవికుమార్, సామర్లకోట ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.భైరవమూర్తి, కాకినాడ రూరల్ ఈఓపీఆర్డీ శ్రీరామ్, ఇంద్రపాలెం, గంగనాపల్లి, మాధవపట్నం, వీకే రాయపురం పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాయం చేసేందుకే గ్రామసభ



బాధితుల పేర్లు నమోదు చేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులోని వీకే రాయపురం వద్ద రోడ్డులో ఇళ్లు కోల్పోయిన వారిని ఆదుకోవడానికే గ్రామసభ ఏర్పాటు చేశామని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం వీకే రాయపురంలో సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణలు తొలగించిన సమయంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకూ బాధితులకు న్యాయం జరగలేదని సర్పంచ్ సర్వేశ్వరరావు ఆరోపించారు. దీనిపై అనేక పర్యాయాలు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశామన్నారు. బాధితుల సమస్యను పరిష్కరించాలని ఆర్డీఓ సూచన మేరకు తహసీల్దార్ గ్రామసభ నిర్వహించారు. సుమారు 80 మంది బాధితులను గుర్తించామని ఆయన చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, గ్రామ మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సేవలు



బీమా పత్రాలను అందజేస్తున్న శాంతివర్ధన మినిస్ట్రీస్ అధినేత వీరబాబు

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు పులిమేరు శాంతివర్ధన విద్యా సంస్థల ద్వారా సేవలు అందిస్తున్నామని ఆ పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, సీఈఓ రఘువీర్ అన్నారు. పులిమేరు శాంతివర్ధన పాఠశాలలో అజీమ్ ప్రేమ్‌జీ సౌజన్యంతో శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమావేశం ప్రిన్సిపాల్ రాయవరపు సత్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్, సీఈఓలు మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు ఇదే పాఠశాలలో చదివి డిగ్రీ పట్టాతో ఉద్యోగం సాధించారన్నారు. ప్రధానంగా ఇక్కడ నేర్పిన విధానాలను విద్యార్థులకు సెలవుల సమయంలో ఇంటికి వచ్చినప్పుడు తల్లిదండ్రులు కొనసాగించాలన్నారు. వారి పట్ల ప్రేమాభిమానాలతో పాటు శ్రద్ధ వహిస్తే మెరికల్లా తయారవుతారన్నారు. వీరికి పాఠశాల తరపున ఉత్తమ సేవలందించేందుకు మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లల పట్ల శాంతివర్ధన యాజమాన్యం, సిబ్బంది చూపిస్తున్న ఆదరణ, ఆప్యాయత ఎనలేనిదన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నిరామయ బీమా పత్రాలు, బస్ పాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డాక్యుమెంట్ ఆఫీసర్ లక్ష్మి, ఏఓ వేణు, బాబి, శాంతివర్ధన్, చైతన్య, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వేట్లపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సామర్లకోట: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వాన్ని మేల్కొలపాలని శనివారం సచివాలయ ఉద్యోగులు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాలు అందజేశారు. వేట్లపాలెం పంచాయతీ పరిధిలోని సచివాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో తమ నిరసన తెలిపామని సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు వీరమల్ల లోవరాజు, ఖురేషి కిరణ్ తెలిపారు. ప్రభుత్వం వెంటనే సీనియారిటీ జాబితా విడుదల చేసి ప్రమోషన్లు ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్ట జాబ్ చార్ట్ ఇవ్వాలన్నారు. ఉద్యోగంలో చేరిన తేదీ ఆధారంగా ఐదేళ్లు పూర్తయిన వెంటనే బదిలీలు చేపట్టారని, అదే విధంగా ఆరేళ్లు పూర్తయిన ప్రతి ఉద్యోగికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అరుణ్, సత్యనారాయణ, గనిలక్ష్మి, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి



శిక్షణ ఇస్తున్న ఆత్రేయపురం ఎంపీడీఓ వెంకటరమణ

సామర్లకోట: ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ఎంపీడీఓలపై ఉందని ఆత్రేయపురం ఎంపీడీఓ బీకే ఎస్ఎస్ వెంకటరమణ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ నెల 28 నుంచి ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు ఉన్న 11 జిల్లాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు నెల రోజుల పాటు శిక్షణ జరుగుతుంది. ఇందులో భాగంగా శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు, లైన్ డిపార్టుమెంట్స్ అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆస్తులను గుర్తించి, వాటి రక్షణకు ఆయా శాఖల సహకారం తీసుకోవాలన్నారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ వ్యవస్థ చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. దాతలు ఇచ్చిన విరాళాలు ప్రభుత్వ ఆస్తులుగా గుర్తించాలని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ జీఓలు, సుప్రీం కోర్టు ఆదేశాలు అమలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. గ్రామాల్లోని రోడ్లు, డ్రైన్లు, పంట కాలువలు, మార్కెట్‌లు, లేఅవుట్ జరిగిన సమయంలో 10 శాతం రిజర్వు స్థలం, పార్కులు ప్రభుత్వ ఆస్తులుగా గమనించాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత ఆయా పంచాయతీ కార్యదర్శులపై ఉంటుందని చెప్పారు.

మహాశక్తి మంత్రం.. లలితా సహస్రం

కాకినాడ రూరల్: అనేక శక్తులతో కూడిన మహామంత్రం లలితా సహస్ర నామమని కాకినాడ శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి అన్నారు. రమణయ్యపేటలోని శ్రీపీఠంలో మహాశక్తి యాగం మూడో సంవత్సరం వంద కోట్ల కుంకుమార్చనల క్రతువు శనివారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మంగళ చండీ, రాజరాజేశ్వరి హోమాలను వేద పండితులు నిర్వహించారు. ఐశ్వర్యాంబిక అమ్మవారు సాయంత్రం రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ, నాలుగు వేదాలు, ఆరు శాస్త్రాలు, అష్టాదశ పురాణాలు, ఉప పురాణాలు, రామాయణ, భారత, భాగవత, సాహిత్య, కావ్య, నాటక, అలంకారాలు, షట్ శాస్త్రాలు, షడాగమాల వంటి అన్నింటి సారం లలితా సహస్రంలో ఇమిడి ఉందని వివరించారు. తిథుల్లో ప్రభావవంతమైన, ప్రమాదకరమైన తిథి అష్టమి అని అన్నారు. సుందర చైతన్యానంద స్వామి పాల్గొన్నారు.

ప్రణామం.. అభయ రూపిణి

- అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు



రాపర్తిలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో చండీ హోమం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో విజయదుర్గాదేవిగా..

పిఠాపురం: నమో అభయ రూపిణీ.. అంటూ ఆ దుర్గామాతను భక్తులు కొలిచారు. శరన్నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆరో రోజు శనివారం రాజరాజేశ్వరీదేవి అమ్మవారు కాళికాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పదో శక్తి పీఠం పూరుహూతికా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారు కాత్యాయనిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దుర్గాడ శివాలయంలో లలితా మాత తులసివనంలో నారాయణి మాతగా దర్శనమిచ్చారు. పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారిని ఇంద్రాణి అవతారంలో అలంకరించారు. పిఠాపురం మండలం రాపర్తిలో దుర్గా మల్లేశ్వరీదేవికి గ్రామస్తులు 108 రకాల సారె సమర్పించారు.

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీదేవిని విజయదుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీచక్ర నవవర్ణార్చన, సహస్ర గులాబీ అర్చన, దర్బారు సేవ తదితర పూజలు నిర్వహించారు. మహిషాసురమర్ధిని అమ్మవారి ఆలయం వద్ద గణపతి, రుద్ర, సహస్ర చండీ హోమాలు జరిగాయి. అయోధ్య రామపురంలోని కనకదుర్గమ్మ ఆలయం, సత్తెమ్మ తల్లి ఆలయం, బడేలమ్మ చెరువు వద్ద నవదుర్గ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు శ్రీలలితా త్రిపుర సుందరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు రాంబాబు రెడ్డి, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాదులు అమ్మవార్లను శ్రీలలితా త్రిపుర సుందరి అవతారంలో అలంకరించారు. పెద్దాపురం వర్ధులవారి వీధిలో శ్రీభువనేశ్వరి పీఠంలో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పీఠంలో మండపారాధన, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణ, శ్రీచక్రార్చన, చండీ హోమం జరిపారు.



దుర్గాడ శివాలయంలో నారాయణి మాతగా లలితాదేవి



పిఠాపురం పాదగయలో కాళికాదేవిగా శ్రీరాజరాజేశ్వరీదేవి



కాత్యాయనిగా తాటిపర్తి అపర్ణాదేవి



రాపర్తిలో శాకంబరిగా దుర్గామల్లేశ్వరి అమ్మవారు



ఇంద్రాణిగా పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారు

భార్యాభర్తలను బెదిరించి సెల్ ఫోన్ అపహరణ



విలేకర్లకు వివరాలు తెలియజేస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: భార్యాభర్తలను బెదిరించి సెల్ ఫోన్ అపహరించిన యువకుడిని 12 గంటల్లోపు సామర్లకోట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం స్థానిక జగనన్న కాలనీకి చెందిన దాడి శివాజీ తన భార్య పద్మతో కలసి ద్రాక్షారామలోని భీమేశ్వరస్వామి ఆలయానికి బయలు దేరిన సమయంలో స్థానిక గాంధీచౌక్ వద్ద ఓ యువకుడు రాయితో చంపుతానని బెదిరించి శివాజీ చొక్కా జేబిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కుని పారిపోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమ సిబ్బంది సాయంతో గాలించి, సాయంత్రం ఆరు గంటల సమయంలో ఐదు తూముల వద్ద నిందితుడు మేకల రామును అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడు పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన వ్యక్తిగా గుర్తించామని సీఐ తెలిపారు.

బాధితుడికి చెక్కు పంపిణీ

సామర్లకోట: హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన గన్నిశెట్టి గీతామాధవ్ ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేశారు. ఈ మేరకు నిధులు మంజూరు రావడంతో ఆ గ్రామ నాయకుడు చల్లా బుజ్జి చెక్కును అందజేశారు.